**"నా వల్ల కాదండీ బాబూ!" మా శర్మ అదే డైలాగు.**

**ఆ వేళ ఆదివారం. అంచేత మా ఆవిడ ఏ కళ నుందో పెసరట్లు వేస్తోంది.**

**ఆవిడ పెసరట్లు తేవడం, ఈయన తినడం - అప్పటికి అర గంట నుంచీ సాగుతోంది ఈ కార్యక్రమం.**

# నా వల్ల కాదండీ బాబూ

## భాగవతుల అరుణ

ఈ డైలాగు విన్న మా ఆవిడ తెగ ఆనందించింది పెసరట్ల కార్యక్రమం ఆపుతున్నందుకు.

కాని ఆ ఆనందం అర నిముషం మాత్రమే.

ఆ డైలాగ్ పెసరట్ల నుద్దేశించి కాదుట, వాళ్ల నాన్న నుద్దేశించిట!

"మళ్లీ ఏమైంది?" అన్నాను నీరసంగా. నాకు పెసరట్లు మిగుల్తాయో, మిగలవో?

పీత కష్టాలు పీతవి.

"మా నాన్న నన్ను మరీ బాధలు పెట్టేస్తున్నా డండీ బాబూ! ఇహ నా వల్ల కాదంతే!" అన్నాడు.

"అయ్యా! మీ నాన్న మిమ్మల్నే కాదు, మమ్మల్ని కూడా బాధ పెడుతున్నారు. అదీ కాక ఈ నాన్నలు పిల్లల్ని బాధ పెట్టడం అన్నది హిరణ్యకశిపుడి కాలం నుంచి వస్తున్న మన దేశసంప్రదాయం. మనం చెయ్యగలిగిందేం లేదు. మనం కూడా నాన్నలయ్యే వరకు ఆగి మన పిల్లల్ని యథాశక్తి బాధ పెట్టడం ఒక్కటే మార్గం!" అన్నాను అనునయంగా.


"ఇప్పుడు మా నాన్న అదే ప్రయత్నంలో ఉన్నాడండీ బాబూ! నాకు పెళ్లి సంబంధాలు చూస్తున్నాడు."

"మరింకేం? హాయిగా చేసేసుకోండి" అంది మా ఆవిడ వంటింట్లోంచి.

"ఏం హాయి లెండి? ఆయనకు ఒక్క అమ్మాయి కూడా నచ్చడం లేదు. ఒకటో, అరో నచ్చితే నాకు నచ్చడం లేదు. అయినా పెళ్లి చేసుకోవడం మరీ ఇంత కష్టం అనుకో లేదండీ బాబూ!" అన్నాడు దీనంగా.

"అయ్యా! పెళ్లి చేసుకోవడమే కాదు, చేసుకున్నాక ఇంకా కష్టం" అన్నాను. అతన్ని ఏడిపించడం నాకో హాబీ.

"అయినా నాకు తెలీ కడుగుతాను గురూజీ!







## పైన మగ - కింద ఆడ!

అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ ఆర్కన్సాస్‌లో డేల్ మిల్లర్ (37) కంప్యూటర్ టీచర్‌గా పనిచేస్తున్నాడు. అందరిలా షర్ట్, టై, కోటు ధరించాక, ఇతగాడు పంట్లాం బదులు ఆడవాళ్ల మిని స్కర్ట్‌ని ధరించి, కాలేజీకి అదే డ్రెస్‌లో హాజ రవుతున్నాడు.

ఇతని డ్రెస్ ధోరణిని మార్చుకోమని, పాంటు తొడుక్కోమని ఇతని భార్య కోరినా వినలేదు. ఫలితంగా వివాహానంతరం 16 ఏళ్లకు ఆమె ఈ కారణంగా ఇతనికి విడాకు లిచ్చేసింది. అంతే గాక, యూనివర్సిటీ వారు కూడా పాంటు వేసుకుని రమ్మంటే వినలేదు సరికదా, ఆడవాళ్లు మగాళ్లలా ఫుల్ హాండ్స్ షర్ట్, జీన్స్ ధరించగా లేనిది, తనకి స్కర్ట్ ధరించే హక్కు ఎందుకు లేదని కోర్టు కెళ్లి గెలిచాడు. జడ్జిగారూ - "అతను కొనుక్కున్న 20 స్కర్ట్‌లు ఏం కాను?" అని, అతను ధరించే దుస్తుల్లో తప్పు లేదని సమర్థించాడు.

- పృథ్వీరాజ్

---

అబిడ్స్‌లో షాపింగ్‌కు వెళ్లినప్పుడు, టాంక్ బండ్‌కు షికారుకు వెళ్లినప్పుడు బోల్డు మంది అందమైన అమ్మాయిలు, ఇంకా బోల్డు పెళ్లైపోయిన అమ్మాయిలు కనిపిస్తారు కదా, తీరా పెళ్లి చేసుకుందా మంటే ఒక్క అమ్మాయి కూడా కనిపించదేం సార్?" అని వాపోయేడు.

"అది పురుషలక్షణం నాయనా! ఇన్నాళ్లకు నీలో మగలక్షణాలు కనిపిస్తున్నాయి. మరేం కంగారు పడకు!"

"అదేఁవిటి గురూజీ? నా మీదేఁవన్నా అనుమానవా కొంపదీసి?" అన్నాడు గాభరాగా. చేతిలో పెసరట్టు ముక్క జారి పడి పోయింది.

"ఛ! ఛ! నువ్వు నూటికి రెండు వందల పాళ్లూ మగాడివే. కాక పోతే లక్షణాలు కొంచెం ఆలస్యంగా కనిపించేయి."

"ఇంతకూ ఈ అందమైన అమ్మాయి లంతా పెళ్లి చేసుకుందాం వనుకునే సరికి ఎండ కాలం వాన పాఁవుల్లాగా కనిపించక పోవడానికి కారణం ఏఁవిటి గురూజీ?" అన్నాడు ఆదుర్దాగా.

"వాళ్లు కనిపించక పోవటం కాదు. నీ కంటికి కనిపించరు. అంతే!" అన్నాను.

"ఒక్క ముక్క అర్థంవైతే ఒట్టు!" అంటూ నెత్తి మీద చెయ్యి పెట్టుకున్నాడు.

"దీనికో థియరీ ఉందినాయనా! తీరిగ్గా చెపుతానులే."

"ఆగడం నా వల్ల కాదండీ బాబూ!"

"నువ్వు ఇలా ఆగడం చేస్తే నా వల్ల కూడా కాదు!" బెదిరించేను.

పాపం! ఒట్టి బెదురుగొడ్డు!

"వేగం చెప్పెయ్యండి గురూ గారూ!"

'సరే. నువ్వు రెండు పెసర ట్లయినా వదిల్తేనే!' బేరం పెట్టేను.

"పెసర ట్లేం ఖర్మ? అల్లం పచ్చడి కూడా త్యాగం చేస్తా ను. వేగం చెప్పండి" బతిమాలేడు.

మళ్లీ ఆలస్యం చేస్తే మనసు మార్చేసుకుంటాడు. అంచేత ముందు పెసరట్లు తిన్నాను. తరవాత ప్రారంభించేను.

"మై డియర్ వాట్సన్! మగాడికి ఆడ వాళ్లు నచ్చడం అనేది మూడు దశల్లో ఉంటుంది. మొదటిది : కాలేజీలో చదివేటప్పుడు ఏ మాధురీ దీక్షితో, మనీషో, లేప్పోతే రంభో, రమ్యకృష్ణో, ఇలా ఓ ముగ్గురు, నలుగురు, మరీ విశాల హృదయులైతే, ఓ అర డజను మంది అమ్మాయిలు నచ్చుతారు..."

"వా ళ్లంతా అమ్మాయిలా కొంపదీసి?" నవ్వింది మా ఆవిడ.

"మధ్యలో అడ్డు రాకు! మగాడి కంటికి అమ్మాయిలే మరి! నచ్చుతారా.., వాళ్లలో ఎవరో ఒకర్ని, వీలైతే అందర్నీ పెళ్లి చేసుకుందాం వనుకుంటాడు. కాని చదు వయ్యేక కొన్ని జీవితసత్యాలు తెలుస్తాయి. సినిమాల్లో అర్ధనగ్నంగా ఉన్న అందమైన సితారలు సామాన్య మానవుడికి - సారీ - మగాడికి అందుబాటులో ఉండరు. ఈ నగ్నసత్యం బోధ పడ్డానికి కొంత సమయం పడుతుంది కదా! ఆ సమయంలో ఏ అమ్మాయీ నచ్చదు! ఇదిగో, ఇప్పుడు నువ్వున్నది ఆ దశ!" చెయ్యి కడుక్కోవడానికి లేచేను.

"అదా సంగతి!" ఆశ్చర్యపోయేడు శర్మ.

ఇంతలో మా ఆవిడ కాఫీ తెచ్చింది.

"తరవాత నాన్న భయం వల్లో, అమ్మ బలవంతం వల్లో, లేకపోతే ఈ జన్మలో పెళ్లి

కాదేమో అన్న భయం వల్లో ఎవరో ఒకర్ని చేసు కుందా మనుకుంటాడు.

"తరవాత ఓ ఏడాది, రెండేళ్ల పాటు భార్యే ప్రియురాలుగా కనిపిస్తుంది. ఇద రెండో దశ."

"మరి మూడో దశ?" శర్మకు ఆత్రుత ఎక్కువ.

"అదే,ఆ తొందరే పనికి రాదు! మూడో దశ అంటే చివరి దశ. పిల్లలు పుట్టేక అందరు ఆడ వాళ్లూ అందంగానే కనిపిస్తారు."

"ఒక్క పెళ్లాం తప్ప!" మా ఆవిడ కొస మెరుపు.

"అదే నాకు నచ్చదు - నేను సీరియస్‌గా చెప్తున్నప్పుడు నువ్వు అలా వెక్కిరించడం - అది సంస్కృతి కాదు... అవీ నాయనా మగాడి దశలు!'

"అది సరే గురూజీ! ప్రస్తుతం నా పరిస్థితి ఏఁవిటి? నా కర్తవ్యం ఏఁవిటి?"

ఏం బాధ పడతావయ్యా శర్మా!

"ఆయన్ని అడుగుతే మరో గంట ఉపన్యాసం వినాలి గాని, శుభ్రంగా పెళ్లి చేసేసుకొండి!" మా ఆవిడ సలహా పారేసింది.

"అయినా మీ పెళ్లాం మీకు నచ్చాలి గాని, ఊళ్లో వాళ్లకు నచ్చక్కర్లేదు. ఈ విషయంలో మీరు కొంచెం ఫర్మ్‌గా ఉండాలి. అంటే గట్టిగా ఉండాలి" హెచ్చరించేడు.

"మీకు ఈ జీవితసత్యా లన్నీ ఎలా తెల్సు గురూజీ?"

"హుఁ! ఇవా? జీవితఁ వనే కళాశాల ఉంది చూడూ, అదే నేర్పుతుంది" అన్నాను వీలైనంత బరువుగా.

"మరి నా కెందుకు నేర్పలేదు?"

"నీ జీవితం గవర్నమెంటు యూనివర్సిటీ అయ్యిం టుంది. అందుకే అలా ఉంది. ప్రైవేటువి అయితే డబ్బు ఖర్చయినా, కొంతైనా తెలుస్తుంది.'

"ఓహ్! ఏఁవి ఉపమానం గురూజీ!" పొంగిపోయేడు. వట్టి అల్పసంతోషి.

'అయినా ఆలోచించాలే కాని ఉద్యోగం విషయంలో కూడా మగాడికి మూడు దశలుంటాయి.'

"పాపం ఆడ వాళ్ల కే దశలూ లేవా?" మా ఆవిడ ముదలకించింది.

"పాతేసిన రాటల్లా అక్కడే ఉంటారు. వాళ్లకు దశలు లేవు. ... ఆఁ, ఉద్యోగం కదూ! మొదటిది - చదువుకునే రోజు ల్లో ఏ టాటా కంపెనీలోనో జి.ఎమ్.గానో, లేక అధమపక్షం ఓ లోకల్ కంపెనీలోనో డి.ఎమ్.గానో ఊహించుకుంటారు. ఈ కలల ఫేడవుట్‌లో దొరికిన చిన్న ఉద్యోగాలు వదులుకుంటారు.

"ఇక రెండో దశ : కొన్నాళ్లు, దురదృష్టం వెంటాడితే కొన్నేళ్లు చిన్న కంపెనీలో పెద్ద ఉద్యోగం సంగతి దేవు డెరుగు, పెద్ద కంపెనీలో చిన్న ఉద్యోగం కూడా దొరకదు. ఆఖరికి వాడి కాళ్లూ, వీడి జేబులూ పట్టుకొని ఓ ఉద్యోగం సంపాదిస్తారు. ఓ ఏడాది వరకూ అది గుమాస్తాగిరీ అయినా కలెక్టరుగిరీ ఫీలింగు వచ్చేస్తుంది ..." మంచి నీళ్ల కోసం ఆగేను.

"గురూజీ, నా కో చిన్న సందేహం ..."

"అడుగు. సందేహం రాకూడదు. వస్తే తీర్చేసుకోవాలి!"

"ఇప్పుడు మన దశ ...?" నసిగేడు.

" నీ సంగతి తెలీదు కాని, నాకు అన్ని దశలూ ఒకటే. నేను సర్వసంగపరిత్యాగిని. ఇక మూడో దశ. అప్పటికి ప్రమోషను వస్తుంది. తన ఉద్యోగం తప్ప మిగతా అన్ని ఉద్యోగాలూ. ఆఖరికి అటెండరు ఉద్యోగం కూడా బావుం దనిపిస్తుంది. ఇలా మగాడి జీవితంలో ప్రతి విషయంలోనూ మూడు దశ లుంటాయి ..." అంటూ లేచేను.

"ఒక్క టడుగుతాను. ఏఁవనుకోరు కదా?"

అనుకో నన్నట్టుగా తలాడించేను.

"మరి ... మరి ... మీరు మొదటి దశలో ఎవర్ని ప్రేమించేరు గురూజీ?"

మా ఆవిడ చిరునవ్వు.

"మా ఆవిణ్ని" ఠకీమని చెప్పేను.

ఖంగు తిన్నాడు మానవుడు. "నే న్నమ్మను సార్!"

"నిజానికి ఎవరి నమ్మకమూ అక్కర్లేదు!"

"మరి ..." నసిగేడు.

"ఏదైనా భరిస్తాను కాని నసుగుడు భరించలేను శర్మా! నీ చొప్పదంటు సందేహం నాకు తెలుసు. నేను అన్ని దశల్లోనూ ఆవిణ్నే ప్రేమించేను" అన్నాను విసుగ్గా.

విరగబడి నవ్వుతోంది మా ఆవిడ.

"ఏఁవిటా వెధవ నవ్వు?"

"పునిస్త్రీ నవ్వే!" ఇంకా నవ్వుతోంది.

"నిజమేనా మేడమ్?" మా ఆవిణ్ని అడిగేడు.

ఆవిడ నవ్వును తాత్కాలికంగా ఆపి, "నిజవే పాపం, ఈయన కొక అమ్మమ్మ ఉండేది. ఆవిడకు తన మనవడి పెళ్లి చూడాలని ఆరాటం. చూడనేమో నన్న భయం. అంచేత అదేదో సినిమా లో లాగ మా చిన్నప్పుడే - అంటే నాకు పది, ఈయనకు పదిహేను ఉంటాయేమో. మా చేత ఉంగరాలు మార్పించి ప్రధానం చేయించేసింది. ఏవుంది? తోసి రాజు, ఆట కట్టు!" మళ్లీ నవ్వు కొనసాగించింది.

ఆ నవ్వు గొప్ప ఇబ్బందికరంగా ఉంటుంది.

ఆడ దాని నవ్వు మగాడి చేత ఏఁవైనా చేయిస్తుందని ఎక్కడో చదివేను.

"ఏఁవిటా అర్థం లేని నవ్వు?"

ఏ పెళ్లాం మొగుడి మాట విన్నాది కనుక?

ఆవిడ నవ్వు సీరియల్‌లా సాగుతూనే ఉంది.

"మరి ఈ జీవితసత్యాలు ..." ఈ శర్మకు వాక్యం పూర్తి చెయ్యడం రాదు. అన్నీ చుక్కలూ, డేష్‌లూ.

"అవి సత్యాలే. నా లాంటి వాళ్లను థియరెటీసియన్స్ అంటారు. మేము థియరీలు చేస్తాం. నీ లాంటి వాళ్లు వాటిని అనుసరిస్తారు" అంటూ లేచేను.

